క్లుప్తంగా

నిప్పురవ్వలు పడి పత్తి దగ్ధం

నాదెండ్ల: బాణాసంచా నిప్పురవ్వలు పడి ఇంట్లో నిల్వ ఉంచిన 10 క్వింటాళ్ల పత్తి దగ్ధమైన సంఘటన నాదెండ్ల మండలం గొరిజవోలు గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు బుధవారం ఎస్సీ కాలనీలోని ఆర్‌సీఎం చర్చి ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ఈ క్రమంలో గ్రామ శివార్ల నుంచి తేరు ఊరేగింపు నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణాసంచా కాలుస్తూ ఊరేగింపు చేస్తుండగా, బాణాసంచా నిప్పురవ్వలు రైతు బాలినేని రమేష్ ఇంట్లో పడ్డాయి. దీంతో ఇంట్లో నిల్వ ఉంచిన పత్తికి మంటలు అంటుకున్నాయి. సుమారు 30 క్వింటాళ్ల నిల్వ ఉండగా, 10 క్వింటాళ్ళ వరకూ పత్తి దగ్ధమైంది. స్థానికులు గమనించి మంటలను ఆర్పారు.

బ్రోచర్ ఆవిష్కరణ

వినుకొండ(నూజెండ్ల): కళాసాగరి ట్రస్ట్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 19, 20,21 తేదీల్లో జరిగే ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాసాగరి ట్రస్ట్ సేవలను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు కూచి రామాంజనేయులుతో పాటు ముత్తినేని గిరితో పాటు పలువురు పాల్గొన్నారు.

హోంగార్డు మృతి

శావల్యాపురం: స్థానిక పోలీసు స్టేషనులో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు సూర్యవంశీ రవి చంద్రబాబు (48) (హెచ్‌జి.283) అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్, ఎస్సై గల్లా రవికృష్ణ సహచర పోలీసు సిబ్బంది రవిచంద్ర మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రభుత్వ పరంగా కుటుంబానికి ఆర్థిక చేయూతతో పాటు అండగా ఉంటామన్నారు. రవిచంద్ర బాబు నియోజకవర్గంలో బొల్లాపల్లి, వినుకొండ, అయినోలు, తదితర పోలీసు స్టేషన్లలో గత 20 సంవత్సరాలుగా మెరుగైన సేవలు అందించి అందరి మన్ననలు పొందారన్నారు. మృతుడికి భార్య ఇద్దరు సంతానం.

గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం



వినుకొండ టౌన్: అగ్నిప్రమాదంలో ఆస్తి నష్టం వాటిల్లిన సంఘటన వినుకొండ రూరల్ ఏనుగుపాలెం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన డి. శ్రీనివాసరావు ఇంటితోపాటు చిరుదుకాణం గ్యాస్ లీక్ కావడంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకుందని గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు, వినుకొండ అగ్నిమాపక సిబ్బంది సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో లక్షాయాభై వేల రూపాయల మేరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపకశాఖ అధికారి ఎం. శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆయన వెంట లీడింగ్ ఫైర్‌మెన్ ఎ.వెంకటేశ్వర్లు, డ్రైవర్ ఆపరేటర్ కె. రవికుమార్, ఫైర్ మెన్లు జి. ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌కె. మస్తాన్‌లు ఉన్నారు.

సబ్సిడీలు ఉపయోగించుకోవాలి

నాదెండ్ల: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ గుంటూరు డీడీఎం శరత్‌బాబు చెప్పారు. మండలంలోని కనపర్రు గ్రామంలో ఎన్‌సీడీఈఎక్స్ సౌజన్యంతో రాంకీ ఫౌండేషన్, పుడమిపుత్ర రైతుల ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో మిర్చి, మొక్కజొన్న రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీఈఎక్స్ అధికారి శ్రీనివాసరావు, ఫౌండేషన్‌ల ప్రతినిధులు జానీ, రాఘేష్, సాంబశివరావు పాల్గొన్నారు.

చుక్కల భూములు నుంచి ..

బొల్లాపలి: ప్రభుత్వం చుక్కల భూములు తొలగించి రైతులకు ఊరట కల్పించిందని ఇన్‌చార్జి తహసీల్దార్ వి. సుధాకర్ శర్మ గురువారం తెలిపారు. మండలంలో 2071 ఎకరాలు చుక్కల భూములు గుర్తించామని చెప్పారు. సుమారు 998 మంది రైతులకు సంబంధించి చుక్కల భూములు తొలగిస్తున్నట్లు దీంతో రైతు లకు అన్ని విధాల రుణ సౌకర్యం, రిజిస్ట్రేషన్ సౌకర్యాలకు అర్హత పొందుతారని తెలిపారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో కలిసి నియోజకవర్గ స్థాయిలో రైతులకు తొలగించిన చుక్కల భూములకు సంబంధించి ధ్రువీకరణ పత్రం అందజేయనున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ చెప్పారు.

పచ్చందనమే.. పచ్చదనమే!



బోయపాలెం నుంచి సంగం గోపాలపురం మధ్యలో



సంగంగోపాలపురం -చెంఘీజ్‌ఖాన్‌పేట మధ్యలో

- హాయిగొలిపే బోయపాలెం -చెంఘీజ్‌ఖాన్‌పేట 'వే'

వేసవిలో అక్కడికి వెళ్తే మండే ఎండలు వెన్నెలవుతుంది.. ప్రకృతి అమ్మఒడిగా మారుతుంది. చారిత్రక గ్రామాల నడుమ రహదారి పర్యాటకులను తమ రమణీయ ప్రకృతి అందాలతో ఆకట్టుకుంటుంది. ఎండకు తాళలేక ఆపసోపాలు పడుతున్న వారికి చల్లని నీడనిస్తూ ఆహ్లాదాన్ని పంచుతోంది. మండే వేసవిలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత సమయంలో ఆ బ్యూటీ ప్రాంతం చల్లని ఊటీని తలపిస్తోంది. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలంలోని బోయపాలెం నుంచి చెంఘీజ్‌ఖాన్‌పేట వెళ్లే మార్గంలో భారీ వృక్షాలు రోడ్డుకు గొడుగు పట్టినట్లుగా వాలిపోయాయి.

సహజ సిద్ధంగా ఏర్పడిన ఇవి వేసవి కాలంలో చల్లని నీడనిస్తున్నాయి. దూర ప్రయాణాలు చేస్తూ ఇక్కడికొచ్చేసరికి మనుషుల్లోని చికాకులు పటాపంచలవుతాయి. దారి పొడవునా నిండైన పచ్చదనం.. వాటివల్ల ఏర్పడ్డ చల్లదనం.. కనుచూపు మేర ఆహ్లాదకరం.. స్వచ్ఛమైన గాలితో ఈ మార్గన వెళ్లే వారిని జీవకోటికి తల్లి అయినా ప్రకృతి తన ఒడిలో సేదదీరుస్తూ.. వారికి హాయిని, ఆనందాన్ని పంచుతుంది.

–యడ్లపాడు

ఉత్తమ సేవలకు వలంటీర్లు ఎంపిక

శావల్యాపురం: మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో విధులు నిర్వహించుతున్న 171 మంది వలంటీర్లుకు ఉత్తమ సేవాలకు ప్రభుత్వపరంగా నగదు బహుమతిలతో పాటు ప్రశంస పత్రంతో సత్కరిస్తున్నట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య వెల్లడించారు. 165 మంది వలంటీర్లు సేవామిత్ర అవార్డులకు ఎంపిక కాగా ఒక్కొక్కరికీ రూ. 10వేలు చొప్పున ప్రభుత్వం వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందన్నారు. పోట్లూరు గ్రామసచివాలయం వలంటీరు సుకన్య, గుంటుపాలెం గ్రామసచివాలయం పరిధిలో భాగ్యలక్ష్మి,కనమర్లపూడిలో దేవరపల్లి శ్రీను,వేల్పూరు-2లో పోదిలి జ్యోతి, కొత్తలూరు గ్రామసచివాలయ పరిధిలో ఐతాం మహేష్‌లు ఐదు మంది సేవారత్న అవార్డులకు ఎంపిక కాగా ఒక్కొక్కరికీ రూ.20 వేలు, సేవావజ్రం అవార్డు కారుమంచి గ్రామసచివాలయ పరిధిలో ఏలికా నాగేశ్వర రావు రూ. 30 వేలు కైవసం చేసుకున్నట్లు చెప్పారు.

ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి సీపీఐకి లేదు

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- విమర్శలను తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యే బొల్లా
- టీడీపీ, బీజేపీ, సీపీఐ కలిసి వినుకొండలో పోటీ చేసి బీజేపీని విమర్శించడం సిగ్గుచేటు
- మసీదు మాన్యం భూములు అమ్ముకున్నది ఎవరని సూటి ప్రశ్న



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు పాటు పడుతున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనను విమర్శించే నైతికహక్కు సీపీఐ నాయకులకు లేదని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వంపై చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ వినుకొండలో టీడీపీ, బీజేపీ, సీపీఐ పార్టీలు కలిసి గతంలో మున్సిపల్ చైర్మన్‌లుగా అధికారాన్ని పంచుకున్నారని, దేశంలో ఎక్కడా లేనివిధంగా వినుకొండలో మూడు పార్టీలు కలవడంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వినుకొండలో బీజేపీతో కలిసి అధికారాన్ని పంచుకొని కేంద్ర ప్రభుత్వాన్ని ఎలా విమర్శిస్తారని ప్రశ్నించారు. తనపై చేసిన విమర్శలను ఖండిస్తూ చందాలు వసూలు చేస్తూ దందాలు చేసే మీరు నన్ను విమర్శించేస్థాయి లేదన్నారు. కష్టపడి 71 వ్యాపారం చేస్తూ ఎదిగానని తెలిపారు.

మసీదుమాన్యం భూములు అమ్ముకున్నది ఎవరు?

వినుకొండలో వంద ఎకరాలకు పైగా మసీదు మాన్యం భూములు భూపోరాటం పేరుతో ఆక్రమించుకొని పేదలకు అమ్ముకున్నది మీరు కాదా అని ప్రశ్నించారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులు స్వయం ప్రతిపత్తి ఉందని తెలిసి కూడా అమ్ముకున్నారని, కోర్టు ఖాళీ చేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఇప్పుడు కూడా సీపీఐ నాయకులు అమ్ముకుంటున్నారని దుయ్యబట్టారు. పేదలకు సంక్షేమ పథకాలు, సొంత ఇంటి నిర్మాణం కలలు సాకారం చేస్తున్నా తమ ప్రభుత్వం మీలాగా ఎక్కడా భూపోరాటాల పేరు తో పేదలకే భూములు అమ్ముకోలేదన్నారు.

పులుపుల వెంకట శివయ్య వంటి జాతీయ సీపీఐ నాయకులు పుట్టిన వినుకొండలో పార్టీ సిద్ధాంతాలను తుంగలో తొక్కుతూ చంద్రబాబు అడుగులకు మడుగులొత్తుతూ పార్టీ సిద్ధాంతాలను కూడా తాకట్టు పెట్టిన మీకు విమర్శించే హక్కు లేదన్నారు. వినుకొండ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి సీపీఐ కంచుకోటగా ఉన్న వినుకొండలో మీరు చేసిన పనుల వలన కనీసం మున్సిపల్ కౌన్సిల్ కూడా గెల్చుకోలేని స్థితిలో ఉన్నారన్నారు. ప్రజలంతా గమనిస్తున్నారని మీ బెదిరింపులకు ఇక్కడ ఎవరూ బెదిరే వారు లేరని ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామన్నారు.

జీవీ చిల్లర రాజకీయాలు మానుకోవాలి

నారా లోకేష్ పాదయాత్ర వంద రోజుల సందర్భంగా వినుకొండ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ర్యాలీ పేరుతో నేషనల్ హైవేపై తమ కార్యకర్తలతో గంటన్నర పాటు మీటింగ్ పెట్టారని, సుమారు 4 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయి ప్రయాణికులు, కూలీలు, ఆటోలు తీవ్రమైన ఎండలో ఇబ్బందులు పడుతుంటే అటుగా వస్తున్న తన కారుపైకి 400 మంది టీడీపీ కార్యకర్తలు చుట్టుముట్టి గోల చేశారని, చట్టాన్ని అతిక్రమించి జాతీయ రహదారిపై మీటింగ్ ఎలా పెడతారని ప్రశ్నించారు. తన మాటలను వక్రీకరిస్తూ అనుకూల మీడియాలో ప్రచారం చేసి చిల్లర రాజకీయాలకు తెరలేపారని ప్రజలంతా గమనిస్తున్నారని రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

ఈ-ఆశ యాప్‌పై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న సురేష్

శావల్యాపురం: ఈ-ఆశ యాప్ నమోదు కార్యక్రమంపై ఆశలు పూర్తిస్థాయిలో అవగాహన కల్గియుండాలని జిల్లా డీసీయం నందిగం సురేష్ అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే సందర్భంగా ప్రభుత్వం మొబైల్ యాప్‌లకు సంబంధించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా డీసీయం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలు, చిన్నారుల చేయు టీకాలు సాధారణ ఆరోగ్య వివరాలు సమగ్ర సమాచారంతో మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. కిల్‌కారి యాప్ ద్వారా గర్భిణులు పొందాల్సిన సేవలు డాక్టరు అనిత ఆన్‌లైన్ సందేశంతో సమాచారం సలహాలు సూచనలు పొందవచ్చున్నారు. మొబైల్ అకాడమీ యాప్ ద్వారా ఆశ వర్కర్లు 46 అంశాలతో కూడిన శిక్షణ కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ఇస్తామని ఆశల నైపుణ్యాన్ని పొంపుదలతో పరీక్ష నిర్వహిస్తామన్నారు. దిశ యాప్‌పై అవగాహన నిర్వహించి బాల్య వివాహాలు నియంత్రణ గృహహింస చట్టాలపై అవగాహన కల్పించారు. ఈసదస్సులో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం, సూపర్‌వైజర్లు సాయి గీతా, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని సుబ్బయ్యతోట ప్రాంతంలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

నేడు రైతుల సమస్యలపై సమావేశం

వినుకొండ(నూజెండ్ల) : స్థానిక బొల్లా కన్వెన్షన్ హాల్‌లో రైతులతో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌తో పాటు జిల్లా అధికారులు సమావేశం శుక్ర వారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తెలిపారు. ఈ సమావేశంలో చుక్కల భూములు, అగ్రహార భూముల సమస్యలపై రెవెన్యూ అధికారులు సమీక్షిస్తారని చెప్పారు. నియోజకవర్గంలో సుమారు 12 వేల ఎకరాల చుక్కల భూములు పరిష్కరించారని, ఇంకా సమస్యలు ఉంటే రైతులు రెవెన్యూ అధికారుల సమక్షంలో తెలియజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ రైతులు సద్వినియోగించుకోవాలని సూచించారు.

మాదిగల స్థలంలో విగ్రహాలు తొలగించాలి

కలెక్టర్‌కు విన్నవించిన కేఎన్‌పీఎస్ నాయకులు

నరసరావుపేట: మాదిగల స్థలంలో అక్రమంగా పెట్టించిన విగ్రహాలు తొలగించాలని, మాదిగల నివాస స్థలాలు మాదిగలకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరేట్ ఎదుట కుల నిర్మూలన పోరాటసమితి (కేఎన్‌పీఎస్) నాయకులు, దళితులు గురువారం ధర్నా చేశారు. దీనికి కారకులైన దాచేపల్లి గ్రామ కాపురస్తుడు అంబటి నవకుమార్‌తో పాటు అతని గ్యాంగ్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్‌కు వినతి చేశారు. కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ మాట్లాడుతూ పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం ఏలియంపేట మాదిగల నివాసస్థలంలో నవకుమార్ గతవారం రోజుల క్రితం రాత్రికి రాత్రే అతని గ్యాంగ్‌తో నాగేంద్ర స్వామీ విగ్రహాలు పెట్టించి కాపులను రెచ్చగొట్టి మత ఘర్షణలకు తెరలేపేందుకు ప్రయత్నించాడన్నారు. కార్యక్రమంలో కేఎన్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గొల్లపూడి చిన్నప్రసాద్, సహాయ కార్యదర్శి జక్కా బ్రహ్మయ్య, ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకులు కంబాల ఏడుకొండలు, ఎమ్మార్పీఎస్ నాయకుడు కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కాలుష్యరహిత అటవీప్రాంతమే ప్రధాన ఉద్దేశం

బొల్లాపల్లి: కాలుష్య రహిత అటవీ ప్రాంతంగా ఏర్పాటు చేసేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమని మండలంలోని నాయుడుపాలెం సెక్షన్ డిఆర్‌వో ఎం. సురేంద్రబాబు తెలిపారు. మండలంలోని నాయుడుపాలెం సెక్షన్ విఎస్ఎస్ పరిధిలోని ప్రాంతంలో పర్యావరణ హిత జీవన శైలిపై ఆయా గ్రామాల ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ ప్రాంగానికి చెందిన అటవీప్రాంతంలో వీఎస్ఎస్ సభ్యులు, అటవీశాఖ సిబ్బందితో కలిసి ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసి తొలగించే కార్యక్రమం నిర్వహించారు. అటవీ ప్రాంతాల్లో ప్లాస్టిక్ పదార్థాలు పడవేయరాదని, చెట్లు పెరగడం ద్వారా పర్యావరణం మెరుగవుతుందని చెప్పారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. పర్యావరణ సమతుల్యత ద్వారా వాతావరణం దెబ్బతినకుండా కాలానుగుణంగా ప్రక్రియలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో విఎస్ఎస్ అటవీశాఖ సిబ్బందితో పర్యావరణ జీవనశైలిపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, విఎస్ఎస్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సమ్మర్‌క్యాంప్ పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

చిలకలూరిపేట: విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెంచేందుకు ప్రథం ఫౌండేషన్, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా రూపొందించిన టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ (టీఏఆర్ఎల్) సెలవుల్లో సరదాగా సమ్మర్ క్యాంప్ పుస్తకాలను పట్టణంలోని ఎంసీఆర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం పంపిణీ చేశారు. మూడు నుంచి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ పుస్తకాలు అందించారు. తర్ల్ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు బోధిస్తున్న అంశాలను ఈ పుస్తకంలో విద్యార్థులు స్వయంగా ఆచరించే విధంగా అన్ని అంశాలను ఈ పుస్తకాల్లో రూపొందించారు. తెలుగు, గణితం, భావనలు ఇవ్వడం, ప్రతి రోజూ ఒక్కో కృత్యం చేసి వేసవి సెలవుల్లో సరదాగా గడిపే విధంగా పుస్తకం రూపొందించారు. కృత్యాధార బోధన ద్వారా విద్యార్థులలో ఆసక్తి కలిగించవచ్చని ఉపాధ్యాయులు తెలిపారు.

ఆటపాటల ద్వారా నేర్పిన అంశాలు విద్యార్థులు బాగా గుర్తు పెట్టుకుంటారని ఉపాధ్యాయులు చెప్పారు. సంభాషణ, కథలు, ధ్వనితో ఆటలు, గుణింతాల చార్ట్, మైండ్ మ్యాపింగ్ విషయాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం కె.సుధా, ఉపాధ్యాయుడు పోటు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు

వినుకొండ(నూజెండ్ల) : వినుకొండ శాఖ గ్రంథాలయ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు జనరల్‌నాలెడ్జ్, తెలుగు, పేపర్ క్రాఫ్ట్, తెలుగు భాషపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బ్రదీనాయక్, ఉపాధ్యాయుడు కేశవసూరి పాల్గొని వేసవిశిక్షణా తరగతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పశువిజ్ఞాన బడి




మాట్లాడుతున్న డీడీ డాక్టర్ నరసింహులు

రొంపిచర్ల: పశు పోషణలో రైతులు కనీస జాగ్రత్తలు తీసుకుంటే వేసవిలో కూడా లాభదాయకంగా ఉంటుందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కాంతారావు అన్నారు. మండలంలోని బుచ్చిబాపన్నపాలెం రైతు భరోసా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన పశువిజ్ఞాన బడి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వేసవిలో పశువులు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. దీనివల్ల పశువుల్లో చూడి నిలవక పోవడం, పొదుగువాపు లాంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ వ్యాధులు పశువుల దరిచేరకుండా ఉండేందుకు యజమానులు చేపట్టాల్సిన జాగ్రత్తలు, అందించాల్సిన ఆహారం గూర్చి వివరించారు. రైతులకు రాయితీపై పశుగ్రాసానికి అనువైన ఎక్కువ దిగుబడులు ఇచ్చే విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నరసింహులు, పశువైద్యులు డాక్టర్ సాయి మహేష్‌రెడ్డి, వాకా శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది లవయ్య, కోటేశ్వరరావు, వెంకట్రావు, గోపాల మిత్రులు దొండేటి కృష్ణారెడ్డి, రామారావు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన పెంచాలి

నరసరావుపేట ఈస్ట్: బాల్య వివాహాలపై గ్రామాల్లో అవగాహన కల్పించి బాలికా సంరక్షణ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.అరుణ తెలిపారు. ఇస్సప్పాలెం శ్రీమహంకాళి అమ్మవారి దేవస్థానం కల్యాణ మండపంలో గురువారం ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు బాల్యవివాహాల నిరోధంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఏడు జిల్లాల్లో బాల్య వివాహాలు అధికంగా ఉన్నట్లు ఎన్‌హెచ్‌ఎఫ్ఎస్ సర్వేలో పేర్కొన్నారని తెలిపారు. ఐసీడీఎస్ సిబ్బంది గ్రామస్థాయిలో బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. బాల్య వివాహాల ద్వారా బాలికలకు జరిగే అనర్థాలను వివరించి, వారిని చైతన్య పరిచి బాల్యవివాహాలను నిరోధించాలన్నారు.

టీసీఎస్‌లో కృష్ణవేణి విద్యార్థులకు ఉద్యోగాలు



నరసరావుపేట ఈస్ట్: కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు చెందిన 19 మంది విద్యార్థులు టీసీఎస్ కంపెనీలో ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. టీసీఎస్ కంపెనీ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన ఆన్‌లైన్ పరీక్ష, 13వ తేదీన విజయవాడ కేబీఎన్ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. దాదాపు 200 మంది పాల్గొన్న పరీక్షల్లో 70 మంది ఎంపికయ్యారని వారిలో 19 మంది కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులేనని వివరించారు. తమ కళాశాలలో విద్యతో పాటు ఉద్యోగాల సాధనే లక్ష్యంగా బోధన సాగుతుందని తెలిపారు. ఉద్యోగ సాధనకు అవసరమైన అర్థమెటిక్, రీజనింగ్ తదితర అంశాల్లో ప్రథమ డిగ్రీ నుంచి శిక్షణ ఇస్తామని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ నాతాని, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం. బాలకోటేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.